

రాజన్న క్షేత్రంలో కొనసాగుతున్న రద్దీ - మూడు రోజులపాటు గర్భాలయ ప్రవేశం రద్దు 5
పర్యాటక కేంద్రం కలేనా? - హామీలకే పరిమితమైన సీతారాముల ఆలయ అభివృద్ధి 6

మిగిలింది 4 రోజులే



- 31తో ముగియనున్న రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీ గడువు
- పారదర్శకత దిశగా చర్యలు
- జిల్లాలో ఇప్పటి వరకు 77.10 శాతం పూర్తి
- గడువులోగా పూర్తి కాకుంటే రేషన్ తొలగిస్తారా?
- జిల్లాలో 1,73,768 కార్డులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న నేపథ్యంలో పారదర్శకత పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందు కోసం రేషన్ షాపుల్లో ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ కేవైసీ) నమోదు ప్రక్రియను ప్రారంభించింది. ఆహారభద్రత కార్డుల్లోని కుటుంబసభ్యుల వివరాలను ఈ కేవైసీ ద్వారా అనుసంధానం చేసుకోవాలి. ఇప్పటికే రేషన్ కార్డుల్లో పేర్లు ఉన్న కుటుంబసభ్యుల నుంచి రేషన్ షాపుల్లో బయో మెట్రిక్ ద్వారా ఈ కేవైసీ చేస్తున్నారు. దీంతో విదేశాల్లో ఉన్నవారితో పాటు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన వారి వివరాలు వెల్లడి కానున్నాయి. వారిని అనర్హులుగా గుర్తించి రేషన్ బియ్యం నిలిపివేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జిల్లాలో ఈ కేవైసీ ప్రక్రియ నత్తనడకనే సాగుతోంది. గడువు ఈనెల 31తో ముగియనుండడంతో ఉండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

• జిల్లాలో 77.10 శాతం పూర్తి

జిల్లాలో 13 మండలాల్లో ఇప్పటి వరకు 77.10 శాతం మాత్రమే రేషన్ లబ్ధిదారులు ఈ కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. 345 రేషన్ దుకాణాల ఉండగా 1,73,768 కార్డులు, 4,97,566 మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో 13,685 అంత్యోదయ కార్డులకు 36,546 మంది లబ్ధిదారులు, 15,98,76 ఆహార భద్రత కార్డులకు 4,60,810 మంది లబ్ధిదారులు, 207 అన్నపూర్ణ కార్డులకు 210 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు 1.73 లక్షల కార్డుల్లోని లబ్ధిదారుల్లో 3,83,622 మంది కేవైసీ చేయించుకున్నారు. జాతీయ ఆహారభద్రత కార్డుల లబ్ధిదారులు 2,81,731 మంది, రాష్ట్ర ఆహార భద్రత కార్డులకు సంబంధించి లబ్ధిదారులు 1,01,891 మంది ఈ కేవైసీ చేయించుకున్నారు.

• ఆధార్ అప్‌డేట్‌తో ఇబ్బందులు

జిల్లాలో రేషన్ లబ్ధిదారులకు ఆధార్ అప్‌డేట్ ఇబ్బందిగా మారింది. రేషన్ కార్డు, ఈ కేవైసీ పూర్తి కావాలంటే ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో మీ సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. కొందరి వేలిముద్రలు రాకపోవడం, ఐరిస్ తదితర



వివరాలు నమోదు లేకపోవడం, పుట్టిన తేదీలు, చిరునామాల మార్పులు, ఫోన్ నంబర్లు లింక్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆధార్ అప్‌డేట్‌తో కూడా ఈ కేవైసీ ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తోంది.

• ఈ-కేవైసీ నమోదు ఇలా

జిల్లాలో రేషన్ కార్డు కలిగిన కుటుంబ యజమానితో పాటు కార్డులో ఉన్న సభ్యులందరూ తమకు సమీపంలోని రేషన్ డీలర్ వద్దకు వెళ్లి ఈ-పాస్ యంత్రం ద్వారా వేలిముద్రలు వేయాలి. వేలిముద్ర వేయడంతోనే రేషన్ కార్డు నంబరుతోపాటు సభ్యుల ఆధార్ నంబరు చూపిస్తుంది. వీరిని సరిచూసిన తరువాత ఆకుపచ్చ రంగు లైట్ వచ్చి సభ్యుల కేవైసీ పునరుద్ధరణ పూర్తవుతుంది. ఈ-పాస్ యంత్రంలో ఎరుపు రంగు లైట్ వెలిగితే రేషన్ కార్డు, ఆధార్ సరిగా పోల్చుకోలేక పోవడంతో రిజెక్ట్ చూపిస్తుంది. దీంతో ఒక యూనిట్ రేషన్ కార్డు నుంచి తొలగిస్తారు. వేలిముద్రలు వేయని వారి యూ నిట్లు తొలగిపోతాయి.

జిల్లాలో మండలాల వారీగా ఈ-కేవైసీ వివరాలు

మండలం	రేషన్‌కార్డులు	లబ్ధిదారులు	ఈకేవైసీ	శాతం
బోయినపల్లి	11,905	32,768	24,230	73.94
చందుర్తి	10,963	29,870	23,356	78.19
గంభీరావుపేట	14,404	40,922	31,828	77.78
ఇల్లంతకుంట	15,553	42,573	33,050	77.63
కోనరావుపేట	13,919	40,243	30,245	75.16
ముస్తాబాద్	14,385	41,900	32,221	76.90
రుద్రంగి	4846	14,662	9789	66.76
సిరిసిల్ల	26,833	79,499	63,143	79.43
తంగళ్లపల్లి	14,099	40,280	32,115	79.73
వీర్నపల్లి	4205	12,826	9336	77.47
వేములవాడ	19,568	56,993	43,804	76.86
వేములవాడరూరల్	7440	20,746	16,141	77.80
ఎల్లారెడ్డిపేట	15,648	44,284	33,764	76.24
మొత్తం	1,73,768	4,97,566	3,83,622	77.10

దుకాణాలు, లాడ్జీల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- డీఎస్పీ నాగేంద్ర చారి

వేములవాడ, జనవరి 27 : వేములవాడ పట్టణ పరిధిలోని వ్యాపారులు, దుకాణదారులు, హోటళ్లు, లాడ్జీలు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ కె.నాగేంద్ర చారి కోరారు. వేములవాడ పట్టణం ప్రముఖ యాత్రస్థలం కావడంతో అపరిచిత వ్యక్తుల సంచారం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, దొంగతనాలు, ఇతర అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించేందుకు సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని అన్నారు. భద్రతా చర్యల రీత్యా ప్రతి ఒక్కరూ తమ దుకాణం, సంస్థ వద్ద విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మూడు రోజుల వ్యవధిలో ప్రతీ దుకాణదారు దుకాణం నుంచి రోడ్డు కనిపించే విధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, పట్టణంలోని ఇళ్ల యజమానులు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని సహకరించాలని కోరారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

- ఫిబ్రవరి 12న ప్రత్యేక సమావేశం, ఎన్నిక

వేములవాడ, జనవరి 27: వేములవాడ పురపాలక సంఘం వైస్ చైర్మన్ పదవికి ఫిబ్రవరి 12వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నారు. ఇంతకుముందు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా వ్యవహరించిన 23 వార్డు కౌన్సిలర్ మధు రాజేందర్ వ్యక్తిగత కారణాలతో డిసెంబరు ఏడో తేదీన తన పదవికి రాజీనామా చేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి జనవరి 5వ తేదీన ఆయన రాజీనామాను ఆమోదించారు. దీంతో వేములవాడ పురపాలక సంఘంలో ఖాళీ అయిన వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల 25వ తేదీన ఉత్తర్వులు జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ తెలిపారు. ప్రత్యేక సమావేశం నిర్వహణపై ఫిబ్రవరి 8వ తేదీలోగా మున్సిపల్ కౌన్సిలర్లకు నోటీసు అందజేయనున్నట్లు, 12వ తేదీన ప్రత్యేక అధికారి సమక్షంలో సమావేశం నిర్వహించి వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు



కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

చందుర్తి, జనవరి 27 : విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలు గుర్తింపునిస్తాయని ఎంపీడీవో రవీందర్ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి రైతు వేదికలో గ్రామపంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియనుండడంతో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులను శనివారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులను, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను సర్పంచ్ చిలుక అంజిబాబు సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ వెంకటేశ్వర్లు, ఏటీఎం రజిత, ఏపీవో రాజయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవిశంకర్, ఏఈవో రమ్య, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

ఇల్లంతకుంట, జనవరి 27: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం ప్రారంభించనున్నట్లు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లంతకుంటలో మినీస్టేడియం నిర్మాణానికి భూమిపూజతోపాటు పలుఅభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో స్నేహభావాలు పెంపు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: క్రీడలతో స్నేహభావాలు పెంపొందుతాయని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మండల పరిషత్ కార్యాలయం అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా ఫ్రెండ్లీ క్రికెట్ పోటీలను శనివారం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, విలేకరులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శుల జట్లు తలపడ్డాయి. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది జట్టు ప్రథమ స్థానం, ఎంపీటీసీల జట్టు రెండో స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో వజీర్‌అహ్మద్, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు, విలేకరులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు ఎస్పీ అభినందనలు



ఎస్పీతో క్రీడాకారులు, కోచ్

సిరిసిల్ల టౌన్, జనవరి 27: హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించిన ఖేలో ఇండియా ఉమన్స్ కిక్ బాక్సింగ్‌లో జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పతకాలను సాధించిన క్రీడాకారులను శనివారం ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలో లైట్ కాంటాక్ట్ 50 కేజీల విభాగంలో గంగనవేణి ప్రవళిక రజతం, పాయింట్ ఫైట్ 40 కేజీల విభాగంలో దాసరి రష్మిత కాంస్యం సాధించగా 32 కిలోల విభాగంలో వడ్నాల కీర్తన ఐదో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న ఎలగందుల శ్రీనివాస్‌తోపాటు ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్‌లో పతకాలను సాధించిన చిన్నారులను, కోచ్ వడ్నాల శ్రీనివాస్‌ను ఎస్పీ అభినందించారు. అనంతరం ఎస్పీని కోచ్ వడ్నాల శ్రీనివాస్, చిన్నారులు సన్మానించారు.

దర్గాను దర్శించుకున్న కొండూరు



దర్శించుకుంటున్న కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట, జనవరి 27: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ హజ్రత్ మీరా శాహ ఖాదిరి దర్గాను నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. దర్గా వద్ద రెండు రోజులపాటు ఉర్సు ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు దర్గాను సందర్శించారు. ఆయన వెంట రహీం ఉన్నారు.

సీఎంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భేటీ

- రాజన్న ఆలయ అభివృద్ధి, నియోజకవర్గంలోని పలు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 27: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో వేములవాడ శాసనసభ్యుడు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భేటీ అయ్యారు. శనివారం హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆది శ్రీనివాస్ వేములవాడ సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. నిధుల కేటాయింపు కోసం విజ్ఞప్తి చేశారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండల ప్రజల తాగు, సాగునీటి సమస్య పరిష్కారం కోసం ఉపయోగపడే కలికోట సూరమ్మ ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేములవాడ రూరల్ మండలం మర్రిపెల్లిలోని మర్రిపల్లి చెరువు, కోనరావుపేట మండలంలోని లచ్చపేట చెరువులను రిజర్వాయర్‌లుగా మార్చడానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని సీఎంను కోరారు. భీమారం మండలం గోవిందారం చెరువులోకి పోతారం రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిధిలో ఎగువ మానేరు 9వ ప్యాకేజీ పనులు వెంటనే ప్రారంభించడానికి చొరవ చూపాలని కోరారు. జిల్లాలో విద్యా రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని, అగ్రహారం డిగ్రీ కళాశాలలో బాలికల వసతి గృహం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజరాజేశ్వరస్వామివారి దేవస్థానం అభివృద్ధి, భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడం కోసం వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ సంస్థకు తగినన్ని నిధులు కేటాయించాలని కోరారు. రాజన్న ఆలయంతో పాటు వేములవాడ పట్టణంలో మౌలిక వసతులు కల్పన పట్టణ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని, వేములవాడ పట్టణ అభివృద్ధి ఆలయ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించేందుకు వీటీడీఏ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరినట్లు ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిపై చర్చించేందుకు వీటీడీఏ సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించారని, త్వరలోనే వీటీడీఏ సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మిడ్‌మానేరు ముంపు గ్రామాల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు, పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. వేములవాడ సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని పలు సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారని వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు సానుకూలత వ్యక్తం చేశారని వివరించారు. రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ముఖ్యమంత్రి ప్రత్యేక సలహాదారులు వేం నరేందర్ రెడ్డి తదితరులను కలిసి జిల్లా పరిధిలోని ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

ఆలయ వార్షికోత్సవ కరపత్రం ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, జనవరి 27 : సిరిసిల్ల రామప్ప రామలింగేశ్వర స్వామి ఆలయ 47వ వార్షికోత్సవ కరపత్రాన్ని శనివారం సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఏటా నిర్వహించే రామప్ప రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవానికి మున్సిపల్ నుంచి పూర్తి సహాయ సహకారాలను అందిస్తామన్నారు. దేవాలయానికి మాజీ మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలను అందిస్తున్నారన్నారు. దేవాలయం అభివృద్ధికి రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గతంలో కేటాయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రామలింగేశ్వర భక్త బృందం, నాయీ బ్రాహ్మణ కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న చైర్ పర్సన్, నాయకులు

భవిష్యత్‌లో అన్ని కోర్టుల్లో వర్చువల్ విధానం

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవిదేవి



కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు మాధవిదేవి, శ్రీనివాసరావు

సిరిసిల్ల క్రైం, జనవరి 27: భవిష్యత్‌లో వర్చువల్ విధానంలోనే కోర్టులు నడుస్తాయని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ టి.మాధవిదేవి అన్నారు. శనివారం జిల్లా కోర్టు పరిధిలో సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జె.శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం హైకోర్టులో వర్చువల్ విధానం అందుబాటులో ఉందని, భవిష్యత్‌లో అన్ని కోర్టుల్లో అమలు కానుందని అన్నారు. ఇంతకుముందు న్యాయమూర్తుల సమక్షంలో న్యాయవాదులు, కక్షిదారులు, సాక్షులు కోర్టుకు ప్రత్యక్షంగా హాజరుకావాల్సి ఉండేదని, ఇపుడు వర్చువల్ విధానంలోనే ఎవరైనా హాజరుకావచ్చని అన్నారు. జిల్లా కోర్టుల్లోనూ ఈ-ఫైలింగ్ విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికే జగిత్యాలలో ప్రారంభమైనట్లు, త్వరలో సిరిసిల్లలోనూ ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు చెప్పారు. దీంతో న్యాయవాదులు ఇంటి వద్దనుంచే ఈ-ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. నిత్యశోధన ద్వారానే న్యాయవాద వృత్తిలో రాణించవచ్చన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ గూగుల్‌పైనే ఆధారపడడం కాకుండా స్వయంగా పుస్తకపఠనం చేయాలన్నారు. జడ్జిమెంట్‌లన్నీ కూలంకషంగా చదివి ఆకలింపు చేసుకోవాలన్నారు. సీనియర్‌ల వద్ద జూనియర్‌లు ఎంతో నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. కొత్తగా వచ్చే న్యాయవాదులను జ్యుడీషియల్ ఆఫీసర్‌లుగా తీర్చిదిద్దేందుకు సీనియర్‌లు ఉచితంగా శిక్షణతరగతులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విధానం శ్రీకాకుళం జిల్లాలో కొనసాగించడంతో ఎక్కువగా ఆ ప్రాంతం నుంచే జ్యుడీషియల్ ఆఫీసర్‌లు తయారవుతున్నారన్నారు. జనాభాకు సరిపడా అదనపు కోర్టులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు పెరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. సిరిసిల్ల చేనేత, వ్యవసాయరంగానికి ఎంతో పేరుందని, వేములవాడలో అతిపెద్ద శైవక్షేత్రం ఉండడం, దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. జిల్లా కోర్టు సముదాయాన్ని పది ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తే బాగుంటుందని, స్థలం అనువుకాకుంటే పాత కోర్టు స్థలంలోనే ఏర్పాటు చేస్తామని అన్నారు. హైకోర్టులో 26మంది న్యాయమూర్తుల్లో ఎనిమిది మంది మహిళలు ఉండడం గర్వంగా ఉందన్నారు. తాను రామగుండంలోనే ప్రాథమిక విద్య అభ్యసించానని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో ఎంతో అనుబంధం ఉందని, ఇక్కడికి రావడం సంతోషంగా ఉందని అన్నారు. మహిళలు న్యాయవాద వృత్తిలో రాణించాలన్నారు. సిరిసిల్లలో ఖాళీగా ఉన్న జూనియర్ సివిల్ జడ్జిల పోస్టుల భర్తీకి కృషి చేస్తామన్నారు. హైకోర్టు న్యాయమూర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ హైకోర్టు జడ్జిగా తాను సొంత జిల్లాకు అధికారికంగా రావడం సంతోషంగా ఉందన్నారు. జూనియర్ న్యాయవాదులను సీనియర్‌లు ఆర్థికంగా తోడ్పాటునందించి న్యాయ సలహాలు ఇవ్వాలన్నారు. జూనియర్‌లు సీనియర్‌ల నిబద్ధతను, అనుభవాలను నేర్చుకోవాలన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత మాట్లాడుతూ సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టుకు తంగళ్లపల్లి, ఇల్లంతకుంట, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించిన 2183 కేసులు బదిలీ చేశామన్నారు. జిల్లాలో దాదాపు తొమ్మిది వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనంతరం హైకోర్టు జడ్జిలు కోర్టు స్థలాన్ని పరిశీలించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, బార్ కౌన్సిల్ సభ్యులు లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల జిల్లా జడ్జి నీలిమ, సీనియర్ సివిల్ జడ్జిలు శ్రీలేఖ, సట్టు రవీందర్, జూనియర్ సివిల్ జడ్జిలు ప్రవీణ్, వినీల్‌కుమార్, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి లక్ష్మణ్, కార్యదర్శి అనిల్‌కుమార్, ఆడెపు వేణు, నాగరాజు, కిషన్, గోవర్ధన్‌రెడ్డి, సురేశ్‌ప్రసాద్, కళ్యాణి, సీనియర్, ఏపీపీలు, పీపీలు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన ఎస్పీ, అదనపు కలెక్టర్లు

జిల్లా కోర్టులో సెకండ్ అడిషనల్ జూనియర్ కోర్టు ప్రారంభానికి వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు మాధవిదేవి, శ్రీనివాసరావును శనివారం ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు ఖీమ్యానాయక్, పూజారి గౌతమి, అదనపు ఎస్పీ చంద్రయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.



పూజలు చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శని వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి తీవ్రగాయాల య్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వీర్నపల్లి మండలం భూక్య తండాకు చెందిన దంపతులు పద్మ- సురేశ్‌తోపాటు మూడు నెలల బాబు బైక్‌పై సిరిసిల్ల ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తు న్నారు. సిద్దిపేటలో ఏఆర్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నిజామా బాద్ జిల్లాకు చెందిన లక్ష్మీనర్సాగౌడ్ కారులో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. హరిదాస్‌నగర్ బస్టాండ్ వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో పద్మ- సురేశ్‌తోపాటు బాబుకు తీవ్రగాయాల య్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ, జనవరి 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరా జేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 30వ తేదీ నుంచి త్యాగరాజ స్వామివారి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. త్యాగరాజ స్వామివారి 71వ ఆరాధనోత్సవాల నిర్వహణ కోసం ఆలయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 30వ తేదీ మంగళవారం నుంచి ఫిబ్రవరి మూడవ తేదీ శనివారం వరకు ఐదు రోజులపాటు త్యాగరాజ స్వామి వారి ఆరా దనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకట నలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన కళాకా రులు సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలతో కళాభిమానులను అలరిస్తారని వారు వెల్లడిం చారు.

రాజన్న క్షేత్రంలో కొనసాగుతున్న రద్దీ


క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

- మూడు రోజులపాటు గర్భాలయ ప్రవేశం రద్దు

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోం ది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ, కళాభవన్‌లో శ్రీస్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మ వారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించు కున్నారు. మేడారం సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న తరుణంలో గత కొద్ది వారాలుగా ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్న క్రమంలో రద్దీ మరింత పెరుగుతుండడంతో శని, ఆది సోమవారాలలో శ్రీస్వామివారి గర్భాలయ ప్రవేశాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం కూడా శ్రీ స్వామివారి గర్భాలయంలో అభిషేక పూజల భక్తులను అనుమతించమని ఆలయ అధికారులు వెల్లడించారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ


నరసింహుడి ఆలయంలోకి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

ధర్మపురి, జనవరి 27: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాది పూజలు, అర్చన లు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. యాగశాల వద్ద లోక క్షేమార్థం నరసింహ హోమం జరిపారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌కు హైకోర్టు న్యాయమూర్తుల రాక

కరీంనగర్ లీగల్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కరీంనగర్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ పి.శ్రీసుధ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఇవి వేణుగోపాల్‌రావు కరీంనగర్ జిల్లా కోర్టుకు ఆదివారం రానున్నారు. కరీంనగర్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఐదవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్ కేసులు) కోర్టు ప్రారంభోత్సవం చేయనున్నారు. వారితో పాటు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి ప్రతిమ, ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజులు ఒక ప్రకటనలో కోరారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


జస్టిస్ శ్రీనివాసరావుకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. శనివారం వారు శ్రీ స్వామి వారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా వేములవాడకు చేరుకున్నారు.ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచా ర్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఆశీర్వచనము గావించారు. ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజే శారు. సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల జడ్జిలు ప్రేమలత, నీలిమ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీవో మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

- రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్

వేములవాడ, జనవరి 27: శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం దత్తత ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 9న నిర్వహించే మాఘ అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆలయ అతిథి గృహంలో శనివారంనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవస్థానం తరపున తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు తగిన బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో పులి మధుసూదన్, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సెస్ వైస్ చైర్మన్ డి తిరుపతి, మామిడిపల్లి సర్పంచ్ కొక్కుల భారత నర్సయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్, శ్రీరాములు, ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్‌గా ఎస్ కుమార్


ఎస్ కుమార్

గోదావరిఖని, జనవరి 27: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నా గపూర్, ఆగ్రాలలో జరగనున్న దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్‌గా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్‌నిర్మల్ లేఖ విడుదల చేశారు. నాగపూర్, ఆగ్రాలలో జరగనున్న కార్యక్రమాలకు 25వేల మంది ప్రతినిధులు హాజరయ్యేలా ప్రణాళికలు చేస్తున్నారు. అన్ని రాష్ట్రాల ఎస్సీ మోర్చా కమిటీలు, జిల్లా కమిటీలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ సమ్మేళన్‌కు హాజరుకానున్నారు. ఇందుకు గాను సమన్వయానికి బాధ్యతలు అప్పగించారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి అయిన ఎస్ కుమార్‌కు ఏపీ, తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటక, కేరళ, తమిళనాడు బాధ్యతలు అప్పగించారు.

భార్యను వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జనవరి 27: అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా, గుడిసెను తగులబెట్టిన కేసులో చెక్కల శివకృష్ణ (25) అనే వ్యక్తికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 30 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మికుమారి శనివారం తీర్పునిచ్చారు. ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ చాపలకాలనీకి చెందిన దివ్య (21) అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మూడు సంవత్సరాలు భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ ఐదు లక్షలు అదనపు కట్నం కావాలని వేధించడంతో పాటు, 2022 అక్టోబర్ 10న అత్తమామలు నివాసం ఉండే గుడిసెను తగులబెట్టాడు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు సాక్షులను కోర్టులో హాజరుపరిచి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి శివకృష్ణకుక జైలు శిక్ష విధించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జనవరి 27: గంగాధర మండలం రంగరావుపల్లికి చెందిన గంగాధర ప్రశాంత్(30) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంగాధర ప్రశాంత్ డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఈనెల 25న తనకు సమస్యలున్నాయట్లు గట్టుబూత్కూర్ శివారులో పురుగుల మందు తాగి తన అన్న ప్రవీణ్‌కు ఫోన్ చేశాడు. ప్రవీణ్ తన స్నేహితుడితో కలిసి వెళ్లి చూడగా గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా ఈ రోజు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి లచ్చయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్నరైతులు

మానకొండూర్, జనవరి 27: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో శనివారం మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను రైతులు అడ్డుకున్నారు. అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతుల వ్యవసాయ భూములలో మట్టిని తీసుకునేందుకు గాను జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ ఎకరానికి రూ. 68వేల ఒప్పందం కుదుర్చుకున్నారు. 45 రోజులకు నగదు చెల్లిస్తామని చెప్పి మూడు నెలలు దాటినా డబ్బులు ఇవ్వలేదని ఆగ్రహిస్తు టిప్పర్‌లను అడ్డుకొని నిరసన తెలిపారు. రోడ్డు పనుల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని రెండుమూడు రోజుల్లో నగదు చెల్లిస్తామని చెప్పడంతో రైతులు వెళ్లిపోయారు.

జన సంద్రం

● కొండగట్టుకు పోటెత్తిన భక్తులు ● రోజంతా నిరంతర దర్శనం


దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


కొండగట్టు ఆలయ పరిసరాల్లో భక్తులు

మల్యాల, జనవరి 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. కొండంతా భక్తజనంతో కిక్కిరిసింది. వచ్చే నెలలో జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతన నేపథ్యంలో ముందుగా దేవుళ్లను దర్శించుకుంటుండగా వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. సీతమ్మ కన్నీటి గుంతల వరకు వరుస కట్టారు. ఆలయ పరిసరాలు, ఆలయ ప్రధాన కార్యాలయం భక్తులతో నిండిపోయింది. వాహనాలను బొజ్జ పోతన్న ఆలయం వద్ద నిలిపివేశారు. ఘాట్‌రోడ్డు నుంచి కిందకు వచ్చే వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ముప్పై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్ ఇతర అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి.

పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

- జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 27: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి, మంథనికి చెందిన ప్రవాసభారతీయుడు డాక్టర్ అశోక్ కాచే అన్నారు. శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో బేసిక్ రిసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (బ్రెడ్) సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విద్యార్థులకు పుస్తక పఠనం, గ్రంథాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవోలు మాట్లాడుతూ రాష్ట్రంలో 610 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 130 బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కాచే సేవలను కొనియాడారు. ఈసమావేశంలో బ్రెడ్ సొసైటీ ఉపాధ్యక్షులు విజయ్ సాయి మేఖ, శశి భూషణ్ కాచె, శ్రీనివాస్ కాచె, వరహాల శ్రీనివాస్, 80 పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై మోసం చేసిన వ్యక్తిపై కేసు

మెట్‌పల్లి, జనవరి, 27: మెట్‌పల్లి పట్టణ అనుసంధ గ్రామమైనా వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన వివాహితకు కొంతకాలం క్రితం వివాహమైంది. అనంతరం విడాకులు తీసుకుని ఇంట్లోనే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో నిజామాబాద్ జిల్లా నవీపేట్ గ్రామానికి చెందిన ఈశ్వర్ అను వ్యక్తి రెండేళ్ల క్రితం పరిచయమయ్యాడు. కాగా కొన్ని రోజుల నుంచి వీరి మధ్య ప్రేమాయణం కొనసాగింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈశ్వర్ ఆమె వద్ద నుంచి లక్ష రూపాయల వరకు తీసుకున్నాడు. కొద్ది రోజులుగా పెళ్లి చేసుకోవాలని వివాహిత కోరుతున్నా మాట దాటువేస్తూ కాలం వెళ్లదీసాడు. దీ తో మోసపోయినట్లు గుర్తించిన వివాహిత ఈశ్వర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించిన ఇద్దరి రిమాండ్


పోలీసులకు రివార్డు అందజేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 27: బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించి పరారైన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లికి చెందిన బోదాసు నరేశ్ (30), పద్మనాభంపల్లికి చెందిన సిద్ధన యాదవ్వ (33)ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన రుద్రాపు పోషవ్వ అనే వృద్ధురాలు జ్వరంతో బాధపడుతూ ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని జంట బైక్‌పై వచ్చింది. ఇంటివద్ద దింపుతామని నమ్మించి ఆమె మెడలోని పుస్తెల తాడును తెంపుకొని పారిపోయింది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందం ద్వారా జిల్లెల్ల, నేరెళ్ల, ముస్తాబాద్ ప్రాంతాల్లోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా శుక్రవారం సాయంత్రం బద్దెనపల్లి క్రాస్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న బోదాసు నరేశ్, సిద్ధన యాదవ్వను అదుపులోకి తీసుకొని విచారించగా దోపిడీ వ్యవహారం బయటపడింది. సులువుగా డబ్బులు సంపాదించవచ్చని దోపిడీలకు పాల్పడుతున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్ఎస్సై జునైద్, కానిస్టేబుళ్లు నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్తర్‌కు రివార్డు అందజేశారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు


విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్/రామగిరి, జనవరి 27: దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలివిడ త జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్ఫోర్స్ మహిళా డిగ్రీ అండ్ పీజీ, వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, వాణినికేతన్ డిగ్రీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామగిరి మండలంలోని సెంటినరీకాలనీ జేఎన్‌టీయూలో జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 93 మంది, మధ్యాహ్నం 92 మంది పరీక్షలకు హాజరయ్యారు.ఉదయం 9 నుంచి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,297మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండో సేషన్‌లో మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు 1,309 మందికి 1,301మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెండు గంటల ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. విద్యా ర్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమ తిం చామని ఎన్‌టీఏ సీటీ కోఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.

భార్యను కిడ్నాప్ చేశారంటూ భర్త ఫిర్యాదు

గొల్లపల్లి, జనవరి 27: మండలంలోని చెందోళి గ్రామంలో ఇంట్లో ఉన్న తన భార్య సౌమ్యను ఆమె కుటుంబ సభ్యులు మరికొందరు కలిసి అపహరించారని భర్త రేగుల రాకేష్ గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రేగుల రాకేష్, ఎనగందుల సౌమ్య ప్రేమించుకుని ఈ నెల 3వ తేదీన వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరు కలిసి రాకేష్ ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో సౌమ్య తండ్రి ఎనగందుల చంద్రమౌళి, కట్కూరి రమేష్, దొనకొండ స్వామి ఇంటిలో ఉన్న సౌమ్యను బలవంతంగా తీసుకెళ్లారు.. భర్త రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ 27: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 క్రీడాకారుల టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చెంజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉదయం 9 గంటలనుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల క్రీడాకారులు ఫొటోతో కూడిన అర్హత సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. అండర్-19 క్రీడాకారులు పదో తరగతి మెమోలతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు

కరీంనగర్ క్రైం, జనవరి 27: కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. మోతాదుకు మించి మద్యం సేవించి తనిఖీలలో పట్టుబడిన 15 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 5 రోజులు, మరొకరికి 3 రోజులు జైలుశిక్ష, రూ.3,500లు విధించారని తెలిపారు. మరో 13 మంది వాహనదారులకు రూ.21,500లు జరిమానా విధించినట్లు తెలిపారు.

స్వగ్రామం చేరుకున్న మృతదేహం

చందుర్తి, జనవరి 27: చందుర్తి మండల కేంద్రానికి చెందిన కైర నాగయ్య (55)అనే వ్యక్తి సౌదీ అరేబియాలో మృతి చెందగా శనివారం మృతదేహం స్వగ్రామానికి తీసుకొచ్చారు. నాగయ్య జీవనోపాధి కోసం 30 సంవత్సరాలుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితం సౌదీ వెళ్లిన నాగయ్యకు 20 రోజులు క్రితం పక్షవాతం వచ్చింది. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

పశుగ్రాసం దగ్ధం

ఓదెల, జనవరి 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో శనివారం ఎంబాడి సమ్మయ్య అనే రైతుకు చెందిన పశుగ్రాసం కుప్ప నిప్పంటుకొని దగ్ధమైంది. రెండు నెలల క్రితం రైతు కొంత భూమిని కౌలుకు తీసుకుని వరి పంట వేసి పంటను పూర్తి చేసుకోగా అనంతరం మిగిలిన నాలుగు ఎకరాల గడ్డిని కుప్పగా పేర్చాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. సమీపంలోని ప్రజలు అక్కడికి చేరుకుని నీరు పోసి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కేసులో మరో ముగ్గురి అరెస్టు

హుజూరాబాద్, జనవరి 27: హుజూరాబాద్ పట్టణంలో నాలుగు రోజుల క్రితం రేషన్ బియ్యం అక్రమ నిల్వ చేసిన కేసులో పరారిలో ఉన్న ముగ్గురిని టౌన్ సీఐ బొల్లం రమేశ్ అరెస్టు చేసినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల క్రితం 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన కేసులో ఏ1గా ఉన్న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామనరి చెప్పారు. కాగా పరారిలో ఉన్న ముగ్గురు బోర్నపల్లికి చెందిన పిల్లి శ్రీధర్, శంకరపట్నం మండలం మెట్‌పల్లికి చెందిన అంగిడి రమేష్, ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన తిరుపతి సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీల తనిఖీ

మంథని, జనవరి 27: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్ ఎల్ల వద్ద మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పై ఇసుకల లారీలను, టిప్పర్లను టీఎస్ఎండీసీ అధికారులు శనివారం రాత్రి తనిఖీ చేశారు. మంథని, ముత్తారం మండలాల్లోని వివిధ ఇసుక క్వారీల నుంచి రవాణా అవుతున్న ఇసుక లారీలు, టిప్పర్లను టిఎస్ఎండీసీ ఎస్ఆర్‌వోలు రాజుకుమార్, అరవింద్ తనిఖీలు చేపట్టారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనవరి 27: తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్-204ను మండలంలోని ఎల్ఎండీ కాలనీలో శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 500లకు పైగా కళాకారులు, ఫిలిం మేకర్లు మంచి చిత్రాలు రూపొందిస్తూ దేశ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సంపాదించడం సంతోషకరమన్నారు. క్రీడలు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయని చెప్పారు. కళాకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ షార్ట్ మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అయిలు రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గన్నమనేని నర్సింగరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సీతామలక్ష్మి, ఇతర సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ పంపిస్తానంటూ మోసం

- ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుల నిరసన


మెట్‌పల్లిలో నకిలీ వీసాలు చూపుతున్న బాధితులు

మెట్‌పల్లి, జనవరి 27: విదేశాలలో జీవనోపాధి కల్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన గల్ఫ్ ఏజెంట్ యేలేటి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం బాధితులు ఆయన ఇంటి ఎదుట నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పనులు లేక ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడానికి పట్టణంలోని యేలేటి రమేష్‌ను కొంత మంది సంప్రదించారు. సదరు ఏజెంట్ దుబాయ్‌కి పంపిస్తానని బాధితులు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 60వేలు తీసుకొని వీసా కాపీలను ఇచ్చి పంపించాడు. వీసాలు తీసుకున్న బాధితులు ఎన్నో ఆశలతో దుబాయి వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు. తీరా అక్కడకు వెళ్లిన బాధితులకు అవి నకిలీ వీసాలని అధికారులు గుర్తించి తెలపడంతో షాక్‌కు గురయ్యారు. ఏజెంట్ చేతిలో మోసపోయినట్లు గుర్తించిన 40 మంది బాధితులు ఆగ్రహంతో ఏజెంట్ ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హల్దిపూర్ వైశ్య గురు మఠాధీశులు వామనాశ్రమ మహా స్వామిజీ నేతృత్వంతో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చిన్నమల్లేశం, రాజయ్య, రాజేశం, అశోక్, నాగేంద్రం, భాస్కర్, ఆంజనేయులు, సుధాకర్, నారాయణ, శ్రీనివాస్, రాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న అతిథులు

సిరిసిల్ల టౌన్, జనవరి 27 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం మినీ స్టేడియంలో శ్రీచైతన్య స్కూల్స్ టెక్నో కరికుల జోనల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తాయన్నారు. క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. సాయంత్రం మున్సిపల్ ఛైర్ పర్సన్ జిందం కళా చక్ర పాణి, జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ విజేతలకు బహు మతు లను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్, వార్డు కౌన్సిలర్ రాపెల్లి అరుణలక్ష్మినారాయణ, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు పాల్గొన్నారు.

నీటి విడుదలతో రైతుల్లో హర్షం



పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

ముస్తాబాద్, జనవరి 27: ముస్తాబాద్ మండలం మద్దికుంట కెనాల్‌లోకి మల్లన్న సాగర్ నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కెనాల్ వద్ద రైతులు నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. నీటి విడుదలకు సహకరించిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింహులు, ప్యాక్స్ డైరెక్టర్ దేవయ్య పాల్గొన్నారు.

బలహీనవర్గాల నాయకులు ఎమ్మెల్యేలు కాకూడదా?

ఇల్లంతకుంట, జనవరి 27: బలహీనవర్గాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యేలుగా గెలవడాన్ని మాజీ మంత్రి కేటీఆర్ జీర్ణించుకోలేక పోతున్నారని, వారు ఎమ్మెల్యేలు కాకూడదా? కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి అని ప్రశ్నించారు. కరీంనగర్ పార్లమెంట్ సోషల్ మీడియా సమావేశంలో కేటీఆర్ మాటలను ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన హామీలను నెరవేర్చని నాయకులు ఇప్పుడు రెచ్చగొట్టేలా మట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే రెండింటిని అమలు చేసినట్లు పేర్కొన్నారు.

బోయినపల్లి ఎంపీపీపై అవిశ్వాసం

బోయినపల్లి, జనవరి 27: బోయినపల్లి ఎంపీపీ పర్లపెల్లి వేణుగోపాల్‌పై ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానాన్ని వేములవాడ ఆర్డీవో మధుసూదన్‌కు శనివారం అందజేశారు. ఎంపీపీ పరపల్లి వేణుగోపాల్ బీఆర్ఎస్ ఎంపీటీసీల మద్దతుతో ఎంపీపీగా కొనసాగుతున్నాడు. బీఆర్ఎస్‌కు చెందిన నర్సింగాపూర్ ఎంపీటీసీ కొనుకటి నాగయ్య, కోరెం ఎంపీటీసీ డబ్బు మమత, అనంతపల్లి ఎంపీటీసీ వనజ, వరదవెల్లి ఎంపీటీసీ ఈడుగు రాజేశ్వరి, మానువాడ గీత, తడగొండ కాంగ్రెస్ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్‌గౌడ్, అవిశ్వాస పత్రాన్ని ఆర్డీవోకు అందజేసిన వారిలో ఉన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

కొడిమ్యాల, జనవరి 27 : మండలంలోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను శనివారం జాతీయ సహకార బ్యాంకుల సమాఖ్య ముంబాయి అధ్యక్షుడు, రాష్ట్ర సహకార టెస్కాబ్, కేడీసీసీ కరీంనగర్ బ్యాంక్ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కలిసి ప్రారంభించారు. మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామంలో 20లక్షల రూపాయలతో నిర్మించు గోదాం నిర్మాణానికి భూమి పూజ చేశారు. మండల కేంద్రంలో 29 లక్షల 16 వేల రూపాయలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ స్ట్రాంగ్ రూం, రికార్డు గది, మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో 20లక్షల రూ పాయలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం నాచుపల్లి గ్రామంలో 26లక్షలతో నిర్మించిన దుకాణాల సముదాయాన్ని, 20లక్షల రూపాయలతో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి, సర్పం చులు మమతనర్సింహరెడ్డి, లతమల్లేశంయాదవ్, పద్మమల్లేశంయాదవ్, లత తిర్మలేష్‌యాదవ్, డీసీవో సత్యనారాయణ, సింగిల్ విండోల ఛైర్మన్లు పాల్గొన్నారు.

సామాన్యులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

గన్నేరువరం, జనవరి 27, సామాన్యులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. చొక్కారావుపల్లిలో నూతన గ్రామపంచాయితి భవనానికి, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గన్నేరువరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన మండల వనరుల కేంద్రం (ఎమ్మార్సీ), డైనింగ్ హాల్, సైన్స్ ల్యాబ్‌లను ప్రారంభించారు. సాంబయపల్లిలో గ్రామపంచాయితి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. మైలారం గ్రామంలో మహిళాసంఘ భవనాన్ని ప్రారంభించారు. గునుకుల కొండాపూర్‌లో రజక సంఘ భవనానికి భూమిపూజ చేసి ఆరె సంఘ భవనాన్ని ప్రారంభించారు. గుండ్లపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ప్రారంభించారు. అంతకుముందు మైలారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను త్వరలోనే నెరవేర్చుతామని చెప్పారు. గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకు డబుల్ రోడ్డు పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, తహసీల్దారు భిక్షపతి, ఎంపీడీవో స్వాతి, ఎంఈవో శ్రీనివాస్, ఏవో కిరణ్మయి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, సునీల్, అనంతరెడ్డి, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటలను కాపాడాలి

- మాజీ ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర, జనవరి 27: ఎల్లంపల్లి నీటిని విడుదల చేసి చొప్పదండి నియోజకవర్గ ఆయకట్టును కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. చర్లపల్లి పరిధిలోని కుర్మపల్లి గ్రామంలో శని వారం ఆయన ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ప్రభు త్వమని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం చొప్పదండి నియోజకవర్గంలో పొలాలు ఎండుతుంటే పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ ఆధారం చేసుకుని వేసిన లక్షల ఎకరాల వరి పొలలాలు ఎండముఖం పట్టనున్నాయి. తక్షణం సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి నారాయణపూర్‌కు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో నీరు విడుదల చేయకపోతే రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రం కలేనా?

- హామీలకే పరిమితమైన మామిడిపల్లి సీతారాముల ఆలయ అభివృద్ధి
- నత్త నడకన ఘాట్ రోడ్డు నిర్మాణం



గుట్టపై వెలిసిన సీతారామచంద్ర స్వామి

కోనరావుపేట, జనవరి 27: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని గుట్టపై వెలసిన సీతారాముల స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామన్న హామీ కలగానే మిగిలింది. సీతారాముల స్వామి ఆలయం అభివృద్ధి హామీలకే పరిమితం అవుతుంది. రెండు సంవత్సరాల క్రితం చేపట్టిన ఘాట్ రోడ్ నిర్మాణం నత్తనడక నడుస్తోంది. మరో భద్రాచలంగా శ్రీ సీతారాముల ఆలయం ఎప్పుడు మారుతుందని భక్తులు ఎదురుచూస్తున్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలోని గుట్టపై వెలసిన శ్రీ సీతారాముల స్వామి ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ ఆలయాన్ని భక్తులు కొంగు బంగారంగా కొలుస్తూ పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకుంటారు. ప్రతి మాఘమా అమావాస్య జాతర కు వేలాదిమంది భక్తులు వచ్చి దర్శించుకుంటారు. శ్రీ సీతారాముల ఆలయం గతంలో ఈ గుట్టపై మునులు తపస్సు చేసే వారని శ్రీ సీతారాముల స్వామి అరణ్యవాసంలో భాగంగా ఈ గుట్టపై సేద తీరాడని పెద్దలు చెప్తున్నారు. అందుకే భక్తులు ఈ స్వామి వారిని కొంగుబంగారంగా కొలుస్తారు. ఇంత ప్రత్యేకత ఉన్న ఈ ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మారుస్తామని టీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో గత ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు మరో భద్రాచలం ఆలయంగా మార్చి పర్యట కేంద్రంగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయంగా కొనసాగడమే కాకుండా గత కొన్ని సంవత్సరాల క్రితమే మామిడిపల్లి శ్రీ సీతారాముల ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి దత్తత తీసుకుంది. దత్త తీసుకున్న అనంతరం కళ్యాణ మండపం నిర్మించారు. ఆలయానికి వెళ్లడానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి కొంతవరకు అభివృద్ధి చేశారు. గుట్ట పైకి ఘాట్ రోడ్డు నిర్మాణానికి 1 కోటి 13 లక్షలు రూపాయలు కేటాయించి నిర్మాణం రెండు సంవత్సరాల క్రితమే చేపట్టారు. కానీ ఘాట్ రోడ్ నిర్మాణం నత్త నడక నడుస్తోంది. ఈ ఆలయ ప్రాంగణంలో పర్ణశాల సీతమ్మ వారి విగ్రహం సీతారామచంద్ర అరణ్యవాసం వంటి విగ్రహాలను ఏర్పాటు చేసి మరో భద్రాచలం ఆలయంగా ఏర్పాటు చేస్తామని పర్యాటక కేంద్రంగా మారుస్తామని గత ఏడు సంవత్సరాల క్రితమే పాలకులు హామీ ఇచ్చినప్పటికీ హామీలు నెరవేరడం లేదు. ఇచ్చిన హామీలు కలగానే మిగిలిపోతున్నాయి. ఈ ఆలయంలో అర్చకులు రంగనాయకుల శ్రీనివాస్, కృష్ణహరి, లక్ష్మణ్ కొనసాగుతున్నారు. వీరికి కూడా చాలీచాలని వేతనాలతో అర్చకులు కాలాన్ని వెల్లదిస్తున్నారు. పర్యటక కేంద్రంగా ఎప్పుడు మారుస్తారని భక్తులు ఎదురుచూస్తున్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనైనా పాలకులు స్పందించి మరో భద్రాచలం ఆలయంగా మారుస్తారని భక్తులు ఎదురుచూస్తున్నారు.



మామిడిపల్లి సీతారాముల ఆలయ ముఖద్వారం



పర్యాటక కేంద్రం మ్యాప్‌ని విడుదల చేస్తున్న అప్పటి ఎమ్మెల్యే (ఫైల్)



కొనసాగుతున్న ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు

విడతల వారీగా బతుకమ్మ చీరల బకాయిలు



మంత్రితో సమావేశమైన ఆది శ్రీనివాస్, కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జనవరి 27 : సిరిసిల్ల బతుకమ్మ చీరల బకాయిలను విడతల వారీగా చెల్లించనున్నట్లు జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు హామీ ఇచ్చారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలసి కేకే మహేందర్‌రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జౌళిశాఖ డైరెక్టర్ వర్షిణితో సమావేశం అయ్యారు. సిరిసిల్ల వస్త్ర సంక్షోభాన్ని మంత్రి, జౌళిశాఖ డైరెక్టర్‌కు వివరించగా సిరిసిల్ల వస్త్ర పరిశ్ర సంక్షోభంపై స్పందించారని మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల బతుకమ్మ చీరల బకాయిలను ప్రతీనెల విడతల వారీగా చెల్లిస్తామని, బతుకమ్మ చీరల ఆర్డర్లతోపాటు 365 రోజులు పని కల్పించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతామని మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ శాఖకు, మెడికల్‌కు కావాల్సిన గుడ్డను సిరిసిల్లలో తయారు చేయించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జౌళిశాఖ డైరెక్టర్ వర్షిణి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మంత్రిని, జౌళిశాఖ డైరెక్టర్‌ను కలిసిన ప్రకాష్

రాష్ట్ర జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జౌళిశాఖ డైరెక్టర్ వర్షిణిని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 27 : దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ బంద్‌ను ప్రజలు, కార్మికులు, కర్షకులు విజయవంతం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని కార్మిక భవనంలో శనివారం ఆల్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకుల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశ వ్యాప్త, గ్రామీణ బంద్‌పై చర్చించారు. అనంతరం సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతత్వ విధానాలను ప్రతిఘటిస్తూ సమ్మెకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. కేంద్రంలో 10 సంవత్సరాల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనతో దేశంలో అసమానతలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగినట్లు చెప్పారు. కార్మికులు, రైతుల హక్కులు కాలరాసిందని మండిపడ్డారు. పేదల బతుకులు అస్తవ్యస్తమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు, రైతులు, నిరుద్యోగుల నుంచి వస్తున్న వ్యతిరేకత దృష్టి మరల్చి రానున్న పార్లమెంట్ ఎన్నికలలో అధికారాన్ని కాపాడుకోవడం కోసం అయోధ్య రామ మందిరం ప్రారంభాన్ని దేశంలో ముందుకు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, సహాయ కార్యదర్శి ఎలిగేటి రాజశేఖర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, ఉపాధ్యక్షుడు పంతం రవి, నాయకులు మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు, అన్నల్‌దాస్ గణేష్, శీలం నర్సయ్య ఎడపెల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు

సకలజనుల సమ్మెతోనే తెలంగాణ వచ్చింది

సుభాష్‌నగర్, జనవరి27: సకలజనుల సమ్మె ద్వారానే తెలంగాణ వచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడు తూ గడచిన పదేళ్ల కాలంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం ఏనాడూ జరగలేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత స్వేచ్ఛగా సమస్యలు చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పదేళ్లలో ఎన్నో కష్టాలు చూశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నియంతలా వ్యవహరించదని అన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛ వచ్చిందన్నారు తెలంగాణ ఉద్యమంలో కేసులు ఎఫ్ఐఆర్‌లు నమోదైన వారికి న్యాయం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరు స్తామన్నారు.

చింతల్‌ఠాణాలో క్రికెట్ పోటీలు

తంగళ్లపల్లి, జనవరి 27: తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణాలో కాంగ్రెస్ నాయకులు, ఉప సర్పంచ్ సత్తు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మందాటి తిరుపతి యాదవ్, చరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్‌లో..

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన గాలిగాని దినేష్, జంగం శ్రీనివాస్ జ్ఞాపకార్థం శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి స్మారక క్రికెట్ టోర్నీ ఫైనల్‌లో విన్నర్ షాదాబ్ - 11 విజేతగా, రన్నరప్‌గా అవునూర్ గ్రామానికికి చెందిన యువదీప్ టీమ్ గెలుపొందాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ముస్తాబాద్ ఎంపీటీసీ శ్రీనివాస్, అవునూర్ ఎంపీటీసీ క్రాంతి, నాయకులు కృష్ణగౌడ్, రాజు, దినేష్, ధర్మేందర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

వేములవాడ రూరల్ జనవరి 27: క్రీడలతో మానసికోల్లాసం కలుగు తుందని నాగాయపల్లి సర్పంచ్ తంపుల సుమన్ అన్నారు. శనివారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో క్రీడాకారులకు టీ షర్టులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబరు చెట్టిపెల్లి నరేష్ పటేల్, యువకులు శ్రీకాంత్, శ్యామ్, అభి, శ్రీకర్, బన్నీ క్రీడాకారులు గణేష్, మనితేజ్, శివ, చరణ్, మహేష్, బన్నీ, చింటు, ప్రణయ్, అమిత్, వర్షిత్, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యుడు చిరంజీవి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో శనివారం దోమల నివారణ మందును పిచికారి చేశారు. ఇంటింటా తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని తొలగించారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వజ్రమ్మ, పంచాయతీ కార్యదర్శి సారిక, వైద్యసిబ్బంది మోహన్, పద్మ, నరేంద్ర, రమేశ్, స్వప్నాదేవి, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ సేవా రత్న

జాతీయ పురస్కారానికి ఎంపిక

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన పర్యావరణ పరిరక్షకుడు, సామాజిక కార్యకర్త దుంపెన రమేశ్ విశ్వకర్మ సేవా రత్న జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా హనుమకొండలోని యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ వారు పర్యావరణ, సామాజిక రంగంలో రమేశ్ సేవలను గుర్తించి పురస్కారం ప్రకటించారు. ఫిబ్రవరి 4న హనుమకొండలో పురస్కారం అందుకోనున్నారు.

సైన్స్ పోటీలతో సృజనాత్మకత పెంపు

సిరిసిల్ల రూరల్, జనవరి 27: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టెస్టులు ఎంతో ఉపయోగపడుతాయని జిల్లా సైన్స్ అధికారి దేవయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం సిరిసిల్ల మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ సైన్స్ టెస్టులతో శాస్త్రీయ దృక్పథం అలవడు తుందన్నారు. ప్రభుత్వ విభాగంలో కుసుమరామయ్య బాలుర ఉన్నత పాఠశాల, సిరిసిల్ల ప్రైవేటు పాఠశాలల విభాగంలో శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన సందీప్, జలేందర్, సాత్విక, శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఎస్ శ్రీసాయి, సిద్దార్థ, రిశ్వంత్‌రావు గెలుపొందగా ఉపాధ్యాయులు అభినందించారు. ప్రధానోపాధ్యాయులు చకినాల శ్రీనివాస్, లకావత్‌మోతీలాల్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు పాకాల శంకర్‌గౌడ్, శ్రీహరి, ఉపాధ్యాయులు రాజలింగం, తిరుపతి, దేవేందర్, సాన బాబు, డేవిడ్సన్, రజిత, దివ్య లావణ్య మౌనిక తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు సూచించారు. గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో మండల స్థాయి చెక్‌ముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ఆధునిక కాలంలో విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలన్నారు. సైన్స్ ద్వారా మనకు అనేక ఆవిష్కరణలు జరిగాయని, సైన్స్ మానవ జీవితాన్ని సలుభతరం చేస్తుందని అన్నారు. విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఈ పరీక్షలో 16 పాఠశాలలకు చెందిన 39 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. మండల స్థాయి పోటీల్లో కొత్తపల్లి జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల ఇన్‌చార్జి సందరగిరి శీలకుమార్, పాశం భాస్కర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీవల్లి, ప్రధానోపాధ్యాయుఉల బాల ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట: మండంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం చెకుముకి సైన్స్‌టాలెంట్ టెస్టును నిర్వహించారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో జరిగిన టాలెంట్ టెస్టులో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో ఆదర్శ పాఠశాల, తెలుగు మీడియంలో అనంతగిరి గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో పొత్తూర్ గ్రామంలోని శ్రీవివేకానంద కాన్వెంట్ పాఠశాలల విద్యార్థుఉ పథమ స్థానంలో నిలిచారు. వచ్చేనెల 3న జిల్లాస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎంఈవో బన్నాజీ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించారు. కార్యక్రమంలో స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, పావని, తిరుపతి, మండల బాధ్యులు మహేష్‌చంద్ర, అనీల్‌కుమార్, మహేందర్, రవి పాల్గొన్నారు.

చందుర్తి: జన విజ్ఞాన వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో చందుర్తి మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. మండలంలో దాదాపు పది పాఠశాలకు చెందిన 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టెస్ట్‌లో ప్రథమ స్థానం పొందిన జడ్పీహెచ్ఎస్ మూడపల్లికి విద్యార్థులు వి.మనిచరణ్, వి.వైశాలి, కె.సకీనా బేగంకు బహుమతులను ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు శంకర్, మండల నోడల్ ఆఫీసర్ వినయ్ కుమార్, జనవిజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు విక్కుతి లక్ష్మీనారాయణ, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పారం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు రామరాజు



ప్రశంస పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు



చందుర్తిలో..